


ఎడపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితాయాదవ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, సాలూరాలో ప్రచారం నిర్వహిస్తున్న యూత్ నాయకులు

# ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం

ఎడపల్లి/బోధన్ రూరల్/నవీపేట, నవంబర్ 7: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను మళ్లీ గెలిపించాలని కోరుతున్నారు.

ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలతో పాటు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితా యాదవ్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బోధన్ నియోజకవర్గ బీఆర్స్ అభ్యర్థి షకీల్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సాలూరా మండల కేంద్రంలో బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా యూత్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కారుగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇతర పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.నవీపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లోకం నర్సయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడో సారి షకీల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్ సైతం దక్కకుండా షకీల్‌ను భారీ మెజారిగీతో గెలిపించాలని కోరారు.



నవీపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

రెంజల్, నవంబర్ 7: మండలంలోని కందకుర్తి గోదావరినదిలో దూకి మడపతి శివకుమార్(23) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.ఉదయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ బట్టల దుకాణంలో పని కోసం ఇంటి నుంచి బయల్దేరి తిరిగి రాలేదు. కందకుర్తి గోదావరి వంతెనపై బైక్, సెల్ ఫోన్ వదిలేసి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వంతెనపై వదిలేసిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు పోలీసులు సమాచారం అందించారు. మంగళవారం సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని నదిలోని మృతదేహాన్ని జాలర్ల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం కోసం బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పని చేసే దుకాణంలో నలుగురికి ఇవ్వాల్సి అప్పు డబ్బు విషయాన్ని అమ్మనాన్నలకు ఎలా చెప్పాలో తోచడం లేదని తన సోదరి శివకాంత ఫోన్‌కు యువకుడు ఆత్మహత్య చేసుకునే ముందు మెస్సేజ్ పంపాడని పోలీసులు పేర్కొన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి రాచప్పా అందించిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి, అప్పులు ఇచ్చిన వారి వేధింపులు భరించలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## గోదావరిలో పడి దివ్యాంగురాలి మృతి

నవీపేట, నవంబర్7: బాసరలో సరస్వతీ అమ్మవారి దర్శనానికి వెళ్లిన ఓ అనే దివ్యాంగురాలు (మూగ మహిళ) యంచ వద్ద గోదావరిలో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. వర్ని మండలం హూమ్నాపూర్‌కు చెందిన గంగాబోయి గంగామణి(39) అనే మూగ మహిళ తన కుటంబ సభ్యులతో కలిసి సోమవారం బాసరలో అమ్మవారి దర్శనానికి వెళ్లింది. అమ్మవారి దర్శనం చేసుకునే ముందు యంచ గోదావరి నదిలో స్నానం చేసేందుకు నది వద్ద ఆగారు. గంగామణి కాలకృత్యాలు తీర్చుకునేందుకు నదివైపు వెళ్లింది. ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతైంది. మంగళవారం మృతదేహాన్ని నీటిలోంచి బయటికి తీయించారు. మృతురాలి కుటుంబ సభ్యురాలు సట్టి శివవ్వ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రెండు నామినేషన్లు దాఖలు

బోధన్, నవంబర్ 7: బోధన్ అసెంబ్లీ నియోకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థులుగా ఇద్దరు వ్యక్తులు మంగళవారం నామినేషన్లు దాఖలుచేశారు. బోధన్ పట్టణం రాకాసిపేట్‌కు చెందిన జునైద్ అహ్మద్ ఖలీల్ నామినేషన్ పత్రాన్ని బోధన్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్‌కు అందించారు. అంతకుముందు బోధన్ పట్టణంలోని 22వ వార్డుకు చెందిన సయ్యద్ అస్గర్ తన నామినేషన్ వేశారు.

## బీఆర్ఎస్‌లోకి వార్డు సభ్యురాలు, యువకులు



సర్పంచ్ శ్రీదేవి సమక్షంలో పార్టీలో చేరుతున్న వార్డు సభ్యురాలు, యువకులు

రెంజల్, నవంబర్ 7: దండిగుట్ట గ్రామంలో మంగళవారం సర్పంచ్ ముళ్లపూడి శ్రీదేవీ కృష్ణారావు ఆధ్వర్యంలో యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో, కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులైన శంకర్, ఎర్ర మంజులా శ్రీను స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరినట్లు సర్పంచ్ తెలిపారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సర్పంచ్ ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు బలవంతపు చేరికలతో బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ విజయాన్ని ఆపలేరని 7వ వార్డు సభ్యురాలు కేతావత్ అనుషా అన్నారు. అనుషా కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు సర్పంచ్ ప్రకటించారు. కార్యక్రమంలో బి.రవి, గోపి, లక్ష్మణ్, గంగాస్వామి, సాయిరాం, రమేశ్, రాంచందర్ పాల్గొన్నారు.

## శాఖాహార భోజనంతో ఆరోగ్యం



శాఖాహార ర్యాలీని నిర్వహిస్తున్న పిరమిడ్ కేంద్రాల మాస్టర్లు

శక్కర్‌నగర్, నవంబర్7: శ్వాస మీద ధ్యాస ఉంచుతూ ప్రతి ఒక్కరూ ధ్యానం చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని పిరమిడ్ కేంద్రాల మాస్టర్లు అన్నారు. బోధన్ పట్టణంలో మంగళవారం సావిత్రి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జయంతి సందర్భంగా శాఖాహార ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా శక్కర్‌నగర్‌లోని ఆయన జన్మస్థలం నుంచి బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీని కొనసాగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు 'ముక్కులోని గాలి ముక్తికి మరోదారి' 'ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస' అనే అంశాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతి వ్యక్తి నిత్యం శాఖాహార భోజనం చేయాలని, మాంసాహారంలో లభించే పోషకాల కన్నా ఎక్కువ మోతాదులో శాఖాహారంలోనే ఉంటాయని వారు వివరించారు. శాఖాహారం ద్వారా మనిషి ఆరోగ్యవంతునిగా ఉంటాడని అన్నారు. శ్వాస మీద ధ్యాస ద్వారా ధ్యానం చేయాలని అన్నారు. దీంతో మనిషి ఆరోగ్యవంతుడిగా ఉండడమే కాకుండా పత్రీజీ చేసిన సూచనలు పాటిస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని వారు వివరించారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్రాల మాస్టర్లు దత్తూరి మాధవి, డాక్టర్ సత్యనారాయణ మూర్తి, అవని రావ్, బి.లక్ష్మి, నల్ల గంగారెడ్డి, భువనేశ్వర చారి, కె.రమాచారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు గౌడ ఆత్మీయ సమ్మేళనం

బోధన్, నవంబర్ 7: బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌కు మద్దతుగా బుధవారం పట్టణంలో గౌడ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు బోధన్ పట్టణంలోని కౌండిన్య గౌడ సంఘం కల్యాణ మండపంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని గౌడ, గీత కార్మికుల సంఘం ప్రతినిధులు పి.గంగాధర్‌గౌడ్, ఎ.సుదర్శన్‌గౌడ్, జయవర్ధన్‌గౌడ్, సాయిబాబాగౌడ్ (రెంజల్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పాల్గొంటారని వారు పేర్కొన్నారు. గౌడ కుటుంబాలు, భార్య పిల్లలతో సహా తరలిరావాలని, సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## సమ్మేళనానికి తరలిరావాలి

ఎడపల్లి, నవంబర్ 7: గౌడ ఆత్మీయ సమ్మేళనం బోధన్‌లో నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు మండల గౌడ సంఘం ప్రతినిధి రవీందర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ సహకారంతో గౌడ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని గౌడ కుటుంబాలు తరలిరావాలని కోరారు.

## సీఎం కేసీఆర్ సభాస్థలం పరిశీలన

శక్కర్‌నగర్, నవంబర్ 7: బోధన్ పట్టణ శివారులోని నర్సాపూర్ ప్రాంతంలో బోధన్–నిజామాబాద్ రహదారి పక్కన ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభ స్థలాన్ని అదనపు డీసీపీ గిరిరాజ్, అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్) జయరాం మంగళవారం పరిశీలించారు. ఈ సభకు సీఎం కేసీఆర్ రాక సందర్భంగా ప్రజలు అత్యధిక సంఖ్యలో వచ్చే ఆస్కారం ఉన్నందున, ఏర్పాట్లపై స్థానిక అధికారులతో డీసీపీలు చర్చించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, బోధన్– నిజామాబాద్ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లకుండా చూడాలని సూచించారు. సభ పూర్తయ్యే వరకు పూర్తి స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎక్కడా అవాంతరాలు, ఇబ్బందులు కలుగకుండా చూడాలని డీసీపీలు స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. వీరితోపాటు బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, పట్టణ సీఐ బీడీ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ జి. శ్రీనివాస రాజు ఉన్నారు.

## 'షకీల్‌పై అసత్య ప్రచారాలు చేస్తే ఖబడ్దార్..'

నవీపేట, నవంబర్ 7: తొమ్మిదన్నర ఏండ్లలో బోధన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే షకీల్‌పై కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తెడ్డు పోశెట్టి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేండ్లు ఎమ్మెల్యే, ఐదేండ్లు మంత్రిగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి బోధన్ నియోజకవర్గాన్ని ఏ పాటి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో రూ.వందల కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే షకీ నియోజకవర్గ రూపురేఖలు మార్చారని అన్నారు. ఎమ్మెల్యే షకీను అభివృద్ధి చేయలేదని అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. 15 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయని సుదర్శన్‌రెడ్డికి బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ చేతిలో మరో మారు ఓటమి తప్పదని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఎమ్మెల్యేగా షకీల్ గెలుపు ఆగదని అన్నారు.

## ఆలయానికి వంటపాత్రలు వితరణ



వంటపాత్రలు అందజేస్తున్న దాత పంజాల కిషన్ గౌడ్

ఎడపల్లి, నవంబర్7: మండల కేంద్రంలో నూతనంగా గౌడ సంఘం వారు నిర్మించిన ఎల్లమ్మ ఆలయానికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. నిజామాబాద్‌కు చెందిన పంజల కిషన్‌గౌడ్ వంట పాత్రలు, ఎడపల్లికి చెందిన ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ సదానందం రెండు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ ఆలయంలో ప్రతి మంగళవారం అన్నదానం చేసేందుకు వంటపాత్రలు టెంట్ హౌస్‌ల నుంచి తెస్తున్నారని గ్రామానికి చెందిన కొండం శ్రీనివాస్ గౌడ్ అతని మామ పంజాల కిషన్ గౌడ్‌కు చెప్పడంతో ఆయన స్వచ్ఛందంగా ఈ పాత్రలను ఆలయంలో అప్పగించారు. వీటిని ఆలయంలో పెద్దలు ఆర్ ఎల్లాగౌడ్, ఎం.నటరాజ్ గౌడ్, కుర్మిండ్ల మల్లా గౌడ్, నాగా గౌడ్, అంజా గౌడ్, లక్ష్మణ్ గౌడ్, గంగామణి (ఏఎన్ఎం)కు అప్పగించారు. ఎడపల్లి గౌడ సంఘాల ప్రతినిధులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.